సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 2 । ఆగస్టు । 2023



వెలుగులోకి 'చీకటి' కబ్జాలు!

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణ దందా బట్టబయలైంది. రెవెన్యూ అధికారుల అండతో 'చీకటి' ఇంటి పేరిట జరిగిన అక్రమ పట్టా పంపిణీ బాగోతం వెలుగు చూసింది. - 8లో



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

రైల్వేకోడూరులోని చిట్వేలి బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో ఉదయ్‌కిరణ్(15) అనే విద్యార్థి మృత్యువాత పడ్డాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1400	రూ.1680
రెండోరకం	రూ.1180	రూ.1380



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 368 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	375	502
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2672.12 కిలోలు

న్యూస్‌రీల్

క్లస్టర్లను ఏర్పాటు చేయండి

రాయచోటి : జిల్లాలో సంక్షేమ శాఖలు త్వరితగతిన క్లస్టర్ల ఏర్పాటు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాయచోటిలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ తదితర అన్ని సంక్షేమ శాఖల పరిపాలన సౌలభ్యం నిమిత్తం క్లస్టర్ల ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయాశాఖల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై తగు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.జాకీర్ హుస్సేన్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అబ్బులోమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం నుంచి ఒకేఒక్కడు



శ్రీ విష్ణుచరణ్ (ఫైల్)

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఐఎఫ్ఎస్‌సీఏ (ఇంటర్‌నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ అథారిటీ) లో అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఏ హోదా ఉద్యోగానికి మదనపల్లెకు చెందిన శ్రీవిష్ణుచరణ్ ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో గత మే నెలలో నిర్వహించిన పరీక్షకు 60వేల మంది హాజరు కాగా, అందులో కేవలం 63 మంది మాత్రమే ఉద్యోగానికి ఎంపికయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శ్రీ విష్ణుచరణ్ ఒక్కడే ఎంపికవడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ, సెబీ, నాబార్డు తదితర సంస్థలకు మార్గదర్శకాలు ఇచ్చే ఐఎఫ్ఎస్‌సీఏలో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

ఉన్నతస్థాయికి చేర్చాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈవో

రాయచోటి టౌన్ : విద్యార్థులను ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం ఉపాధ్యాయులకు సూచించారు. 9, 10వ తరగతి ఎఫ్ఏ 1 పరీక్షల నిర్వహణలో భాగంగా మంగళవారం రాయచోటి డైట్ కేంద్రంలో పరీక్ష పత్రాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రమాణాల పెంపునకు కృషి చేయాలన్నారు. సబ్జెక్టులవారీగా నిర్వహించిన అన్ని ప్రశ్న పత్రాలను పరిశీలించిన తరువాత సిలబస్ పూర్తి చేసిన పేజీలలో సంతకాలు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకు చెప్పారు.


రూ.10 వేలు దాటిన పసుపు ధర

కడప అగ్రికల్చర్ : పసుపు ధర కనీవినీ ఎరుగని రీతిలో రోజురోజుకు పైపైకి పాకుతోంది. నాలుగు రోజుల క్రితం రూ.9 వేలలోపు ఉన్న పసుపుధర క్రమేపీ పెరుగుతూ పదివేలకు దాటింది. మంగళవారం కడప మార్కెట్‌యార్డులో ఫింగర్ క్వింటాల్ పసుపు ధర రూ.10,312 పలకగా.. బల్బ్ ధర క్వింటాల్ రూ.10,069 పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన పదేళ్లలో ఇంత ధర ఎన్నడూ లేదంటూ సంబరపడుతున్నారు.

• బాబు మాటలు

నీటి మీద రాతలు





ముద్దనూరు మండల శెట్టివారిపల్లె వద్ద చంద్రబాబునాయుడు వేసిన శిలాఫలకం(ఫైల్), నిండుకుండలా ఉన్న గండికోట జలాశయం

- రాయలసీమ ప్రాజెక్టుల పట్ల చంద్రబాబుకు అంతులేని నిర్లక్ష్యం
- జీఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్, వైఎస్ జగన్ ప్రభుత్వాలే
- చంద్రబాబు హయాంలో నామమాత్రపు వెచ్చింపు
- ప్రాజెక్టుల సందర్శన పేరుతో మరోమారు కొత్త డ్రామాకు తెర
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకాలు వేసిన ఘనత బాబుదే
- నేడు 26 టీఎంసీల నీరుతో కళకళలాడుతున్న గండికోట

సాక్షి ప్రతినిధి, కడప : 'వినేవారు లోకువైతే చెప్పేవారు చంద్రబాబు' అన్న విషయాన్ని మరోమారు టీడీపీ అధినేత చంద్రబాబు రుజువు చేస్తున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు సాగునీటి ప్రాజెక్టుల పట్ల చిత్తశుద్ధి చూపకుండా, విపక్షనేతగా ప్రాజెక్టుల సందర్శన పేరుతో మరో కొత్తడ్రామాకు తెరలేపారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి 1996, 99 ఎన్నికలకు ముందు రెండు సార్లు శంకుస్థాపన చేయడం మినహా, ఆ ప్రాజెక్టు నిర్మాణం పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యమే ప్రదర్శించింది. పైగా రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు రావని.. అందుకే అభివృద్ధి చేయలేదని నిర్లజ్జగా ప్రకటించడం మరో వింత. నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పట్ల టీడీపీ సర్కార్ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది.

1995 నుంచి 2004 వరకు తొమ్మిదేళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 2014–19 విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. తాజాగా 25 టీఎంసీల నీరు నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చిన పాపాన్ని చంద్రబాబు మూటగట్టుకున్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలిచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసింది కూడా చంద్రబాబే. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా ఈ ప్రాంత ఉన్నతికి కృషి చేస్తారనుకుంటే.. ఐదేళ్ల కాలాన్ని ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు.

శంకుస్థాపనతో సరి..

గండికోట ప్రాజెక్టుకు 1996 ఫిబ్రవరి, 29న సీఎం హోదాలో చంద్రబాబునాయుడు శెట్టివారిపల్లె సమీపంలో శంకుస్థాపన చేశారు. తర్వాత వామికొండ వద్ద మరోమారు 1999 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పట్ల ఏమాత్రం శ్రద్ధాసక్తులు చూపలేదు. మరోవైపు గండికోటను నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చారు. 2004లో అధికారంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చాకే ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించారు. ఆయన హయాంలో రూ.3213 కోట్లు వెచ్చిస్తే, తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కేవలం రూ.804 కోట్లు మాత్రమే వెచ్చించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పగ్గాలు అందుకున్న తర్వాత జీఎన్ఎస్ఎస్ పరిధిలో రూ.4256 కోట్లు వ్యయం చేశారు. మరో రూ.454 కోట్లు నిర్వాసితులకు చెల్లించేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేశారు. మంత్రివర్గ సమావేశం సైతం ఆమోదం తెలిపింది. పైగా 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌కే దక్కిందని పలువురు వివరిస్తున్నారు.

కరువు నిరారణకు ప్రత్యేక ప్రణాళిక..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రక్రియను ప్రారంభించి వేగవంతంగా పనులు చేపడుతోంది. 12టీఎంసీల నీరు జీఎన్ఎస్ఎస్ ద్వారా లిఫ్ట్ చేసి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కరువు నివారణకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో జంగం దేవరపల్లె వద్ద నీరు కలపడం ద్వారా పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, రాయచోటి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు యోగ్యకరంగా మారింది. వాస్తవం ఇలా ఉంటే రాజకీయాల కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కొత్త డ్రామాకు సిద్ధమయ్యారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలలో ఖర్చు చేసిన వివరాలు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	వైఎస్సార్ హయాం (2014కు ముందు)	చంద్రబాబు సర్కార్ (2014–19)	వైఎస్ జగన్ సర్కార్ (2019–23)
గండికోట	819	413.5	504
సర్వారాయసాగర్	209.48	78.9	212
జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్	405.3	164.9	698.3
సీబీఆర్	601	24.28	250.68
సీబీఆర్ రైట్ కెనాల్	352.8	9.80	55.50
పైడిపాళెం	736.9	113.5	142
గండికోట టన్నల్ విస్తరణ	-	-	250
అవుకు టు గండికోట కెనాల్ విస్తరణ	-	-	500
ఆర్డీఎంపీ (రాయల సీమ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు)	-	-	1644
మొత్తం ఖర్చు	రూ.3123.68 కోట్లు	రూ.804.88 కోట్లు	రూ.4256.48కోట్లు

నేడు చంద్రబాబు పర్యటన

జమ్మలమడుగు : నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు బుధవారం పర్యటించబోతున్నారని, ఈ పర్యటనను టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి సుబ్బరామిరెడ్డి పిలుపునిచ్చారు.

4న మదనపల్లెకు..

మదనపల్లె : మదనపల్లెకు ఈనెల 4న (శుక్రవారం) మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నట్లు టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్ తెలిపారు. పర్యటనలో భాగంగా మదనపల్లె సమీపంలోని చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పరిశీలిస్తారని, అనంతరం విలేకర్ల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. పుంగనూరు వద్ద హంద్రీ-నీవా కాలువ పరిశీలిస్తారన్నారు. కాగా, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రవీంద్రయాదవ్‌తో కలిసి దొమ్మలపాటి రమేష్ మంగళవారం చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు.

'సీమ'కు బాబు క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పెంపును వ్యతిరేకించిన చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీపై ధర్నా చేసిన దేవినేని ఉమాను ఇరిగేషన్ మంత్రిని చేశారు
- బాబు హయాంలో కేసీకి నీరివ్వకపోతే ధర్నాలు చేయాల్సి వచ్చింది
- గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను వద్దన్నారు
- ఏ మొహం పెట్టుకొని ప్రాజెక్టుల పర్యటనకు వస్తున్నారు
- కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ప్రకటించండి
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సహకరిస్తానని మాట ఇవ్వండి
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిల ధ్వజం

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు రాయలసీమకు చేసిన ద్రోహానికి ప్రాజెక్టుల వద్ద బోర్లా పడుకొని క్షమాపణ చెప్పాలని డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. కడప వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బద్వేల్ ఎమ్మెల్యే డా.దాసరి సుధ, మేయర్ సురేష్ బాబుతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్ బాషా మాట్లాడుతూ 2014 అధికారంలోకి వచ్చిన తర్వాత గండికోట వద్దకు వచ్చి కాలువ గట్లపై పడుకొని ప్రాజెక్టులను పూర్తి చేస్తానని చెప్పిన చంద్రబాబు, ఏ ప్రాజెక్టును పూర్తి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పులివెందుల్లో బస్టాండు కూడా కట్టలేకపోయారని గతంలో విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు వెళ్లి బస్టాండు కట్టారో, లేదో చూడాలని సూచించారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి కుప్పానికి ఏమీ చేయలేకపోయారని, వైఎస్ జగన్ సీఎంగా అయ్యాకే కుప్పాన్ని రెవెన్యూ డివిజన్ చేశారని తెలిపారు.

పర్యటనకు ఎలా వస్తున్నారు..

ఏ మొహం పెట్టుకొని చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శనకు వస్తున్నారో చెప్పాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నిలదీశారు. 1984లో దివంగత ఎన్‌టీఆర్ 50 టీఎంసీల సామర్థ్యంతో వెలుగోడు, 70 టీఎంసీల సామర్థ్యంతో బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించారన్నారు. 1989–1994 మధ్య కాంగ్రెస్ హయాంలో కొంతమేరకు పనులు జరిగాయని, 1994 నుంచి ఎన్‌టీఆర్‌ను ఏ రకంగా పదవీచ్యుతుణ్ణి చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. జిల్లా ప్రజల అదృష్టం కొద్దీ 2004లో వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రాజెక్టు పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన కొనసాగాయన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11వేల నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచుతుంటే ప్రకాశం బ్యారేజీ వద్ద దేవినేని ఉమాతో ధర్నా చేయించిన ఘనత బాబుకే దక్కుతుందన్నారు. రాయలసీమపై అంత అక్కసు ఉన్న దేవినేని ఉమాను ఇరిగేషన్ శాఖామంత్రిని చేసి సీమవాసులకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వెలుగోడు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని తెచ్చుకోవాలంటే 0 నుంచి 18 కి.మీ వరకూ కెనాల్‌ను రిపేర్ చేయాలని కోరితే చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఏ ప్రాజెక్టులో తట్టెడు మట్టి కూడా వేయలేదని.. ఒక్క ఏడాది కూడా బ్రహ్మంసాగర్‌లో 5 టీఎంసీలకు మించి నిల్వ చేసిన చరిత్ర లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.500కోట్లు ఖర్చు చేసి ఆ కెనాల్‌ను పూర్తి చేయడం వల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీటిని నిల్వ ఉంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు జిల్లాకు ప్రాణాధారంగా తయారైందన్నారు. దీన్నుంచి ఆర్టీపీపీకి, బద్వేల్, కడపకు త్రాగునీరు, కొప్పర్తి పారిశ్రామిక వాడకు నీరందిస్తున్నారన్నారు. బాబు హయాంలో కేసీకి నీరివ్వకపోతే తాము ధర్నా చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం జూలై 1వ తేదినే ఖరీఫ్‌కు నీరందించినట్లు వివరించారు.

ఈ ప్రశ్నలకు బదులేది..

రాయలసీమ ప్రాజెక్టులకు ప్రాణాధారమైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను, గాలేరు నగరి, హంద్రీనీవాలను ఎందుకు వద్దన్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను ఆనాడే పూర్తి చేసి ఉంటే బ్రిజేష్ ట్రిబ్యునల్ ప్రకారం నికర జలాలు ఆ ప్రాజెక్టులకు వచ్చేవన్నారు. తెలుగుగంగకు 1984 నుంచి 2004 వరకూ 20 ఏళ్లలో రూ.1700కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్ఆర్ సీఎంగా ఉన్న ఐదేళ్లకాలంలో రూ.2300కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. హంద్రీనీవా, గాలేరు నగరికి 20 ఏళ్లలో రూ.13కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్సార్ రూ.6400కోట్లు ఖర్చు చేశారన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ పెంపు కోసం రూ.4400కోట్లు వినియోగించారన్నారు. 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.2వేలకోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారన్నారు. చంద్రబాబు ఆలోచనల నుంచి వచ్చిన ఒక్క ప్రాజెక్టు కూడా రాయలసీమలో లేదన్నారు. ఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, పూర్తిచేశారో బాబు చెప్పాలన్నారు. గండికోట ముంపువాసులకు రూ.1000కోట్లు పరిహారం ఇచ్చి 27 టీఎంసీలు నిల్వ ఉంచారని, పైడిపాలెంలో 6 టీఎంసీలు, చిత్రావతిలో ఎఫ్ఆర్ఎల్ స్థాయికి నింపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పోతిరెడ్డిపాడును 44వేల క్యూసెక్కుల నుంచి 80వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి వైఎస్ జగన్ శ్రీకారం చుడితే దాన్ని చంద్రబాబు వ్యతిరేకించారని, ఈలోపు తెలంగాణ వారు ఎన్‌జీటీకి వెళ్లి స్టే తెచ్చారన్నారు. గుండ్రేవులకు బాబు టెంకాయ మాత్రమే కొట్టారని, అన్ని క్లియరెన్సులు తేవడానికి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. సిద్దేశ్వరంను కూడా తాము పూర్తి చేస్తామన్నారు. కడప గూండాలు, రాయలసీమ రౌడీలని పదే పదే మాట్లాడిన చంద్రబాబు ఏ మొఖం పెట్టుకొని ఈ ప్రాంతానికి వస్తున్నారో చెప్పాలని నిలదీశారు. వెలిగల్లు ప్రాజెక్టుకు బాబు మూడు సార్లు శంకుస్థాపన చేశారని, వైఎస్ ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి చేశారని గుర్తు చేశారు. కర్నూల్‌లో హైకోర్టు పెడతామని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సహకరిస్తామని బాబు మాట ఇచ్చి ఇక్కడ అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగులీనుతున్న నవరత్నాలు

- విద్యుత్ శాఖలో తొమ్మిది రకాల పథకాలు
- మొదటి స్థానంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్
- సంక్షేమం, వినియోగదారులకు మేలు చేసే పథకాలకు చోటు
- కడప సర్కిల్‌లో గత ఏడాది రూ.వేయి కోట్లకు పైగా ఖర్చు
- 2.14లక్షల మందికి ప్రయోజనం



విద్యుత్ పంపిణీ వ్యవస్థ

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నవ రత్నాలు' సరికొత్త చరిత్రను సృష్టించాయి. ఇందులోని పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు సైతం అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నవరత్నాల్లాగే దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో కూడా తొమ్మిది రకాల పథకాలతో సామాన్యులకు లబ్ధి చేకూరుతోంది. వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలో ఇందు కోసం విద్యుత్‌శాఖ వేల కోట్లు ఖర్చు చేస్తోంది.

ప్రజలకు మేలు చేసేలా..

విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మేలు చేసేలా రూపొందించారు. ఉచిత విద్యుత్, పేదలందరికీ ఇళ్లు, ఆక్వా రైతులకు సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, క్షౌ రశాలలు, లాండ్రీలకు నెలకు 150 యూనిట్లు, దోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్‌కు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, స్వర్ణకారులు, చేనేత మగ్గాలకు, పవర్ లూమ్స్‌కు నెలకు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, పవర్ ఫర్ ఆల్ నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయ నిర్మూలన, సమస్యల పరిష్కారం కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు(జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2)నియామకం వంటివి చేర్చారు.

ఏడాదిలో కోట్లాది రూపాయల ఖర్చు

విద్యుత్ శాఖ తెచ్చిన పథకాల ద్వారా భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో ఈ పథకాల కోసం ఒక ఏడాదిలో రూ.1053 కోట్లు ఖర్చు చేశారు. వీటి ద్వారా 2,14,711 మందికి మేలు చేకూరింది. నాలుగేళ్లలో పరిశీలిస్తే దీని విలువ నాలుగు రెట్లు ఉంటుందని అంచనా. విద్యుత్ సంస్థ ద్వారానే ఇన్ని కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పేదలకు లబ్ధి చేకూర్చేందుకు ఇతర శాఖల ద్వారా చేస్తున్న మేలు అంచనాకు అందడం లేదు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత

వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలు తీర్చేందుకు ఎలాంటి కొరత లేకుండా నిధులు మంజూరు చేస్తోంది. ఇదే తరహాలో విద్యుత్ పంపిణీ సంస్థ కూడా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని చేర్చింది. అన్ని స్కీముల కంటే అత్యధిక మంది లబ్ధి పొందుతున్న పథకం ఇదే. ఈ స్కీంకే ప్రభుత్వం కూడా అధిక నిధులు వెచ్చిస్తోంది. మరో ముఖ్యమైన పథకం ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించడం. ఉచిత విద్యుత్ తర్వాత అత్యధిక మంది లబ్ధిదారులు ఈ పథకంలోనే ఉన్నారు.

కడప సర్కిల్‌లో విద్యుత్ పథకాల ద్వారా ఏడాదిలో చేసిన ఖర్చు వివరాలు

విద్యుత్ పథకాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖర్చు
వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్	1,05,692	రూ.930కోట్లు
పేదలందరికీ ఇళ్లు	12,009	రూ.39కోట్లు
ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200యూనిట్లు ఫ్రీ	95,513	రూ.37.04కోట్లు
క్షౌ రశాలలు, దోభీ ఘాట్లు, లాండ్రీలకు నెలకు 150 యూనిట్లు ఉచిత విద్యుత్	458	రూ.40లక్షలు
స్వర్ణకారులకు చేనేత మగ్గాలకు, పవర్ లూమ్స్‌కు నెలకు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్	458	రూ.20లక్షలు
పవర్ ఫర్ ఆల్ నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం	--	రూ. 27 కోట్లు
గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో విద్యుత్‌సేవల కోసం ఎనర్జీ అసిస్టెట్లు నియామకం	581	రూ.19.56 కోట్లు
అక్వా రైతులకు సబ్సిడీ (ఉమ్మడి జిల్లాలో అక్వాకల్చర్ లేదు)	---	---

రక్తహీనతను నివారించండి



మాధవరం పీహెచ్‌సీ సిబ్బందితో ముఖాముఖి నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

సిద్దవటం : కొత్త అనీమియా మీటర్లతో కిశోర బాల, బాలికలకు ఏఎన్ఎంలు హిమోగ్లోబిన్‌ను పరీక్షించి రక్తహీనతను నివారించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశాడే సమావేశానికి హాజరయ్యారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, సీహెచ్ఓలతో ముఖాముఖి నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆగస్టు 7వ తేదీన మిషన్ ఇంద్రధనస్సును, 10న నులిపురుగుల దినోత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని వైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా

యువతికి పాము కాటు

ములకలచెరువు : వ్యవసాయ పనులు చేసుకుంటున్న సమయంలోపాముకాటేయడంతో యువతి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. యువతి కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పాతపల్లెకు చెందిన రైతు శంకర్‌రెడ్డి కుమార్తె భవ్యశ్రీ(22) పొలం పనులు చేసుకుంటుండగా పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు గమనించి 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఒకే ఈతలో రెండు దూడల జననం



రెండు దూడలకు జన్మనిచ్చిన పాడిఆవు

మదనపల్లె : మదనపల్లె పట్టణంలోని ముగ్గురాళ్ల వంక ప్రాంతానికి చెందిన పాడిరైతు కె.నరసింహులుకు చెందిన పాడిఆవు మంగళవారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒక పెయ్యదూడ, ఒక కోడె దూడ జన్మించాయి. ఒకే ఈత లో రెండు దూడలు జన్మించడంతో పాడిరైతు నరసింహులు ఆనందం వ్యక్తం చేశాడు. ఈ విషయంపై వెటర్నరీ వైద్యాధికారి షిరిన్‌లారెన్స్ స్పందిస్తూ పాడి రైతు నరసింహులకు చెందిన పాడి ఆవు హెచ్‌ఎఫ్‌ఎక్స్ జాతికి చెందినదని ఒకే ఈతలో పెయ్యదూడ, కోడెదూడ జన్మించడం వల్ల పెయ్యిదూడ తన సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతుందన్నారు. ఈ పరిస్థితిని ఫ్రీ-మార్టిన్ అనే మగప్రవర్తన వల్ల పెయ్యదూడలోని అండాశయాలు నిర్జీవంగా మారి సంతానలేమి జీవితకాలం ఉంటుందన్నారు. రెండు దూడలను కోడె దూడలుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

అట్లూరు : ఇటీవల కువైటులో మృతి చెందిన పొన్నఓలు నరసారెడ్డి(48)మృత దేహం మంగళవారం సాయంత్రం అట్లూరు మండలంలోని మృతుని స్వగ్రామం బోడిశెట్టిపల్లికి చేరింది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు... నరసారెడ్డి జీవనోపాధి కోసం కువైటు దేశం వెళ్లాడు. అక్కడ బిల్డింగు పనులు చేసుకుంటూ ఉండేవాడు. గత నెల 27వ తేదీన బిల్డింగు లిప్టు గుంతలో పడి చనిపోయాడు. మృతుడి సోదరుడు పొన్నఓలు శేషారెడ్డి మంగళవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వెలుగులోకి 'చీకటి' కబ్జాలు!

తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణ దందా బట్టబయలైంది. రెవెన్యూ అధికారుల అండతో 'చీకటి' ఇంటి పేరిట జరిగిన అక్రమ పట్టా పంపిణీ బాగోతం వెలుగు చూసింది. కోట్ల విలువ చేసే భూమిని దర్జాగా కబ్జా చేయడంపై అధికారులే కళ్లు తేలేస్తున్నారు. నిజాలు నిగ్గు తేల్చేందుకు నడుం బిగించారు.

- గాలివీడులో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణ
- పట్టాల తీగ లాగితే భూ కబ్జా డొంక కదిలింది..
- బదిలీపై వెళ్లిన రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే 'చీకటి' వ్యవహారం



గుర్రాలమిట్టాల వద్ద యంత్రాల సహాయంతో చదును చేస్తున్న ప్రభుత్వ భూమి



గోరాన్‌చెరువు గ్రామంలో ఆక్రమణకు గురైన కోట్లాది విలువ గల ప్రభుత్వ భూమి

గాలివీడు : మండల పరిధిలోని గోరాన్‌చెరువు, అరవీడు, గాలివీడు, వెలిగల్లు ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాలలో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వేలు లక్షలు కాదు కోట్లు పలుకుతున్నాయి. దీంతో ఇక్కడి ప్రభుత్వ భూములపై అక్రమార్కులు కన్నేశారు. అదును చూసుకుని దర్జాగా కబ్జా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అధికారుల అండతోనే అక్రమార్కులు బరి తెగించారన్న ఆరోపణలు ఉన్నాయి.

వెలిగల్లు ప్రాజెక్టు గుర్రాల మిట్ట వద్ద ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 2286లో 0.70 సెంట్ల భూమిని కొందరు యంత్రాల సహాయంతో చదును చేశారు. అంతేకాదు రేకుల షెడ్లు, తోటల పెంపకం వంటివి ఏర్పాటు చేసుకొంటున్నారు. గోరాన్‌చెరువు గ్రామంలో అప్పటి రెవిన్యూ అధికారులు, సర్వేయర్, వీఆర్‌ఓల అండదండలతో 852/1 య2.15 సెంట్లు చీకటి విజయకుమారి పేరుతో పట్టాను మంజూరు చేశారు. 852/2లో య0.36 చీకటి సుధాకర్, 867/3లో య2.50 చీకటి సురేష్‌కుమార్, 867/4లో య0.50 సెంట్లు చీకటి సుధాకర్, 867/7లో య0.20 సెంట్లు చీకటి వెంకటేష్, 867/8లో య0.42 సెంట్లు చీకటి వెంకటేష్, 867/4ఎస్1 య0.50 సెంట్లు చీకటి వెంకటేష్, 868/1 య0.36 సెంట్లు చీకటి వెంకటేష్, 868/3లో 0.76 సెంట్లు, 868/5లో య1.76 సెంట్లు చీకటి సురేష్‌కుమార్, 884/ఎస్1లో య2.04 సెంట్లు చీకటి విజయ్‌కుమారి.. వీరి కుటుంబ సభ్యులు వీఆర్‌ఏలుగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ భూమిని గుట్టుచప్పుడు కాకుండా మండలంలో పని చేసిన రెవిన్యూ, సర్వేయర్‌తో లోపాయకార ఒప్పందం కుదుర్చుకొని దాదాపు రూ.20కోట్లు విలువ గల భూమికి ఆక్రమణ పట్టాను పొందారు. తమ బంధువులు తమ భూమిని ఆక్రమణ చేశారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు వీరి వ్యవహారమంతా బయటికి వచ్చింది. తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో గల ఈ భూములను సంరక్షిస్తే.. భావితరాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ కల్యాణమండపాలకు ఉపయోగకరంగా అనువుగా ఉంటాయని ప్రజలు సూచిస్తున్నారు. ఈ విషయం గోరాన్‌చెరువు, గాలివీడు ప్రజలు సీఎంఓ కార్యాలయంలో ఫిర్యాదు వెళ్లడంతో రెవెన్యూ యంత్రాంగం ,ఆక్రమణ పట్టాలు, భూ కబ్జాలపై ముందుకు కదిలింది. రికార్డులను పరిశీలించగా గతంలో పని చేసిన అధికారులు ఎవరెవరు పట్టాలు ఇచ్చారు, ఒకే కుటుంబానికి చెందిన ఇంత మందికి ఇవ్వచ్చా అనే విషయంపై పరిశీలన చేస్తున్నారు. భూ వ్యవహారాన్ని కలెక్టర్‌కు దృష్టికి వెళ్లి పట్టాలను రద్దు చేయడంతో పాటు, ఈ తతంగాన్ని నడిపించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు

భూ కబ్జాలు, భూ పట్టాలు చేస్తున్న ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు. ఉన్నతాధికారులకు నివేదికలను పంపి, వాస్తవాలను తెలియజేస్తాం. ఇక్కడ గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారు. ఎవరెవరి హయంలో పట్టాలను ఇచ్చారో జిల్లా కలెక్టర్‌కు నివేదికలను అందించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూమిని స్వాధీనం చేసుకుంటాం.

- దైవాదీనం, గాలివీడు తహసీల్దార్, గాలివీడు మండలం

చర్యలు తీసుకుంటాం

గాలివీడులోని విలువైన భూములను వివిధ రకాల ఆక్రమణలకు గురవుతున్నాయి, వాటిని పరిశీలించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం. గతంలో పట్టాలు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం.

- ఆర్డీఓ రంగస్వామి, అన్నమయ్య జిల్లా

వైఎస్సార్, నంద్యాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా ఆకేపాటి



ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్, నంద్యాల జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. కాగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షునిగా విశేష సేవలు అందించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా సమర్థవంతగా పనిచేస్తున్నారు.

కర్నూలు, అన్నమయ్య జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా రామసుబ్బారెడ్డి



రామసుబ్బారెడ్డి

కర్నూలు, అన్నమయ్య జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి నియమితులయ్యారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉంటున్న రామసుబ్బారెడ్డి గతంలో మంత్రిగా పనిచేశారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆశయాలు నచ్చి పార్టీలోకి వచ్చారు. గతమున్సిపల్, పంచాయతీ, స్థాని క సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయానికి విశేష కృషి చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



బోలోరో ఢీ కొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన పసి బాలుడు హరినందన్



ప్రమాదంలో గాయపడిన విష్ణుమోహన్

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు, మరో పసిబాలుడు తీవ్రంగా గాయపడి జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. పీటీఎం మండలం పట్టెంవాండ్లపల్లె పంచాయతీ కర్రెవాండ్లపల్లెకు చెందిన ఎం.విష్ణుమోహన్ (27) మంగళవారం తన అక్క కుమారుడు హరినందన్ (19 నెలలు) తో కలిసి ద్విచక్రవాహనంలో గ్రామానికి సమీపంలో వడ్డిపల్లె రోడ్డు పక్కన చిల్లర దుకాణం ముందు నిలబడి ఉండగా, అదే మార్గంలో కర్నాటక నుంచి వస్తున్న బొలేరో వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో పసిబాలుడు హరినందన్ తీవ్రంగా గాయపడగా, విష్ణుమోహన్ సైతం గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాధితులిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో..

సీటీఎం గ్రామానికి చెందిన పెయింటర్ ఏ.శేఖర్ రోజూవారి పనులలో భాగంగా ద్విచక్రవాహనంలో సీటీఎం నుంచి కొత్తవారిపల్లెకు వెళుతుండగా గుడిసివారిపల్లె జెర్సీ డెయిరీ వద్ద కారు ఢీకొనింది. ప్రమాదంలో శేఖర్ గాయపడగా స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై కొనసాగుతున్న విచారణ

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథం (వెలుగు) కార్యాలయంలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి గత నెల 11 నుంచి ప్రారంభమైన థర్డ్ పార్టీ విచారణ కొనసాగుతోంది. కార్యాలయంలో సీఐఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి, ఇసుక రీచ్ కమీషన్ల నిధులకు సంబంధించిన నిధుల దుర్వినియోగంపై సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం నిధుల దుర్వినియోగంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీ సునీతను విచారించి వివరాలను నమోదు చేశారు. అనంతరం 2014 సంవత్సరం నుంచి ఇక్కడ పని చేసిన ఏపీఎంలను విచారించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ అసిస్టెంట్ మురళీ, ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఏపీఎం శైలజ, సీసీలు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి



కరెంటుషాక్‌తో మృతి చెందిన కర్నూలు జిల్లాకు చెందిన మాదిగ సుంకన్న

రాజంపేట : విద్యుత్ షాక్ తగిలి భవన నిర్మాణ కార్మికుడు మాదిగ సుంకన్న (56) మృతి చెందాడు. రాజంపేట పట్టణం ఆర్‌ఎస్‌రోడ్డులోని కరూర్ వైశ్య బ్యాంక్ పై భాగంలో స్లాబ్ కాంక్రీట్ పనులు చేస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చిట్వేలికి చెందిన పాపిరెడ్డి తన భవనాన్ని కరూర్‌వైశ్యబ్యాంకు అద్దెకు ఇచ్చారు. ప్రస్తుతం ఈయన కువైట్‌లో ఉన్నారు. సమీప బంధువు గంగాధర్ సాయంతో నాల్గవ అంతస్తులో భవనం నిర్మాణపనులు ప్రారంభించారు. ట్రాఫిక్‌తో రద్దీ దృష్ట్యా స్లాబ్‌పనులు రాత్రి పూట చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున ఆరుగంటల వరకు స్లాబ్ పనులు పూర్తిచేశారు. మంగళవారం ఉదయం 8గంటల సమయంలో స్లాబ్‌కు ఉపయోగించిన లిఫ్ట్ కడ్డీలను తొలగించే సమయంలో ప్రమాదవశాత్తు అవి పక్కన ఉన్న విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో ఆ కడ్డీలకు విద్యుత్ సరఫరా జరిగి మేస్త్రీ మాదిగ సుంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బాబునాయక్‌ను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. కుమార్‌నాయక్, రమేష్‌నాయక్‌లకు స్వల్పంగా యాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందచేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వలసకార్మికులే..

కర్నూలు జిల్లా ఆలూరు తాలుకా పుటకులమర్రి గ్రామానికి చెందిన మాదిగ సుంకన్న 30 సంవత్సరాలుగా పట్టణంలోని సాయినగర్‌లో ఉంటున్నారు. మృతునికి భార్య,కుమార్తె, కుమారుడున్నారు. కార్మికులు ఎన్‌టీఆర్ కాలనీలో ఉంటున్న కూలీలు పాశ్యా బాబునాయక్, రమావత్ కుమార్ నాయక్, రమేష్ నాయక్‌లకు గాయాలు బారిన పడ్డారు. వీరందరూ పొట్టకూటి కోసం వలస వచ్చిన కార్మికులే.

ఏమార్చి.. డబ్బులు కాజేసి..



బాధితుడు చంద్ర

కలికిరి: మాటల్లో కలిపి ఏటీఎం కార్డును మార్చాడు.. ఆపై ఎంచక్కా డబ్బులు డ్రా చేశాడో చోరుడు. కలికిరి క్రాస్ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కలికిరి ఇందిరమ్మకాలనికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పూజారి చంద్ర ఆదివారం ఏటీఎంకు వెళ్లాడు. నిరక్షరాస్యుడైన చంద్ర అక్కడున్న ఓ వ్యక్తి సహాయం తీసుకుని తన యూనియన్ బ్యాంక్ ఏటీఎం కార్డుతో రెండు సార్లు నగదు విత్‌డ్రా చేసుకున్నాడు. నగదు డ్రా చేసుకున్న అనంతరం స్టేట్‌మెంట్ రశీదు రావడం లేదని చెప్పిన సదరు గుర్తు తెలియని వ్యక్తి మాటల్లో పెట్టి ఏటీఎం కార్డు మార్చాడు. ఆపై అక్కడి నుండి జారుకున్నాడు. అనంతరం రెండు రోజులుగా కలికిరిలోని ఏటీఎం కేంద్రాలు, కందూరు రోడ్డులోని పెట్రోల్ బంకులో ఆ ఏటీఎం కార్డు నుంచి రూ.45వేలు నగదు డ్రా చేసుకున్నాడు. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు మంగళవారం బ్యాంకుకు చేరుకుని కార్డును బ్లాక్ చేయించాడు. అనంతరం తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ఉదయ్‌కిరణ్ (ఫైల్)



పోలీస్‌స్టేషన్‌లో విలపిస్తున్న మృతుని తల్లిదండ్రులు, బంధువులు

రైల్వేకోడూరు : పట్టణ పరిధిలోని చిట్వేలి బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో ఉదయ్‌కిరణ్(15) అనే విద్యార్థి మృత్యువాత పడ్డాడు. మండలంలోని ఎస్.కొత్తపల్లికి చెందిన రోజువారీ కూలీలైన తిరుమలేశు, రాజేశ్వరిలకు ముగ్గురు కుమారులు. తల్లిదండ్రులు తమ ముగ్గురు బిడ్డల్ని పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. పెద్ద కొడుకు ఉదయ్‌కిరణ్ పదో తరగతి చదవుతున్నాడు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు చిట్వేలి బైపాస్ రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి రేణిగుంటవైపు వెళ్తున్న లాజిస్టిక్ లారీ ఢీకొంది. దీంతో ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రులకు అమ్మాయి అప్పగింత

బద్వేలు అర్బన్ : ఇంటి నుంచి తల్లిదండ్రులకు, భర్తకు చెప్పకుండా పారిపోయి వచ్చిన ఓ వివాహితను సోమవారం రాత్రి బద్వేలు పోలీసులు గుర్తించి మంగళవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు జిల్లా శివప్పనగర్ కల్లూరు ఎస్టేట్‌కు చెందిన 16 ఏళ్ల అమ్మాయికి మూడు నెలల క్రితం ఏకాంబరేశ్వరరెడ్డితో వివాహమైంది. అయితే భర్తతో ఏర్పడిన మనస్పర్థలతో సదరు అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పకుండా బంగారు, నగలతో సోమవారం రాత్రి ఇంటి నుంచి పారిపోయి వచ్చి బద్వేలు ఆర్టీసీ బస్టాండులో నెల్లూరుకు వెళ్లేందుకు సిద్ధమైంది. ఇదే సమయంలో రాత్రి విధుల్లో భాగంగా బస్టాండుకు వచ్చిన ఏఎస్ఐ సి.వెంకటేశ్వర్లు, సిబ్బంది అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమ్మాయిని విచారించి అసలు విషయం తెలుసుకున్నారు. వెంటనే అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి వారిని బద్వేలు అర్బన్ స్టేషన్‌కు పిలిపించి వారికి అప్పగించారు. ఇంటి నుంచి పారిపోయేందుకు యత్నించిన అమ్మాయిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని సీఐ అభినందించారు.

వేంపల్లెలో పట్టపగలే చోరీ

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని పులివెందుల రోడ్డులో ఉన్న రెడ్డినగర్ ప్రాంతంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. గజ్జల సౌభాగ్య తన ఇద్దరు కుమార్తెలు దామినిరెడ్డి, ధరణిరెడ్డితో కలిసి రెడ్డినగర్ ప్రాంతంలో నివాసముంటున్నారు. పెద్ద కుమార్తె దామినికి అవసరమైన వస్తువుల కోసం మంగళవారం ఉదయం కడపకు బయలుదేరి వెళ్లారు. అలాగే చిన్న కుమార్తె ధరణిరెడ్డి స్థానికంగా ఉన్న పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం చిన్న కుమార్తె ఇంటికి రాగా తలుపులు గడేలు పగులగొట్టి తెరిచి ఉండటంతో భయమేసి ఇంటి పక్కన నివాసముంటున్న బాబురెడ్డికి ఈ విషయాన్ని తెలిపింది. అతను లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఇంట్లో ఉన్న బీరువా పగులగొట్టి దొంగలు బంగారు ఆభరణాలు అపహరించినట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని యువకుడి ఆత్మహత్యాయత్నం

కురబలకోట : కురబలకోట ఎంపీపీ బి.దస్తగిరి ఇంటిపై దాడికి పాల్పడిన యువకుడు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ముదివేడు ఎస్ఐ ముబిన్ తాజ్ కథనం మేరకు..కురబలకోట ఎంపీపీ బి. దస్తగిరికి స్వయానా అన్న కుమారుడు బి.జాకీర్ (29). ఇతనికి ఎంపీపీతో పాటు అంగళ్లలోని మరి కొందరితో భూ సమస్యపై వివాదం ఉంది. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం రాత్రి వేళ దస్తగిరి ఇంటిపై అనుచరులతో కలసి జాకీర్ దాడి చేశారు. ఆసమయంలో దస్తగిరి లేకపోవడంతో అతని భార్యను దుర్భాషలాడారు. ఇంటిలోకి చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై దస్తగిరి ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా ఈ వ్యవహారం నడుస్తోంది. మరో వైపు పోలీసులు కూడా విచారిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారన్న కారణంగా మనస్తాపం చెందిన జాకీర్ మంగళవారం ఇంట్లోని కాలం చెల్లిన మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అతన్ని మరో ఆసుపత్రికి తరలించారు.

డబ్బు తీసుకొని ఇవ్వడం లేదనే..

ఇదిలా ఉండగా ఇంటి స్థలాలు కోసం కొందరి వద్ద జాకీర్ డబ్బు వసూలు చేసి దస్తగిరికి ఇచ్చారని అవి రాకపోవడంతో వెనక్కి డబ్బులు అడగడంతో తమ కుమారుడిపై పోలీసులకు ఎంపీపీ ఫిర్యాదు చేశారని జాకీర్ తల్లి తస్లీమా చెబుతోంది. దీనికి తోడు పోలీసులకు పిర్యాదు చేశారన్న మనస్తాపంతో తమ కుమారుడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడని తెలిపింది. ఈ విషయమై ఎంపీపీ దస్తగిరి మాట్లాడుతూ స్వయానా అన్న కుమారుడైన బి.జాకీర్ ఈనెల 30న రాత్రి మద్యం సేవించి అతని అనుచరులతో తన ఇంటిపై దాడి చేశారన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ముబీన్ తాజ్ వెల్లడించారు.

మణిపూర్ ఘటనపై నిరసన



మణిపూర్ ఘటనను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు

మదనపల్లె : మణిపూర్‌లో జరిగిన అమానవీయ సంఘటనను నిరసిస్తూ కేంద్రప్రభుత్వవిధానాలను ఖండిస్తూ, ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలని కోరుతూ మంగళవారం మదనపల్లె పట్టణంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున మహిళలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో మూకుమ్మడిగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడి నుంచి చిత్తూరు బస్టాండు, టౌన్‌బ్యాంకు సర్కిల్, బెంగుళూరు బస్టాండు, మల్లికార్జున సర్కిల్,సీటీఎం రోడ్డు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. ర్యాలీలో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. సీఎస్ఐ చర్చి ఫాస్టర్ డాక్టర్ సునిల్‌వరకుమార్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో కొన్ని నెలలుగా రెండు తెగల మధ్య గొడవల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై ఏ మాత్రం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి మహిళలను వివస్త్రలు చేసి ఊరేగించడం సభ్యసమాజం తలదించుకునే చర్యన్నారు. దేశంలోని మత సామరస్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణంలోని వివిధ క్రైస్తవ సంఘాలకు చెందిన చర్చి ఫాస్టర్లు, సీఎస్ఐ చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్,కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఓ ఓబులరెడ్డి

రాయచోటి అర్బన్ : వైద్య ఉద్యోగులు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించాలని డీఐఓ ఉషశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా వైద్య,ఆరోగ్యశాఖకార్యాలయంలో అన్ని నియోజకవర్గాల నోడల్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పనితీరు, ఎన్‌సీడీ-సీడీ, మిషన్ ఇంద్రధనుష్, వ్యాధినిరోధక టీకాలు తదితర అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించాలంటూ ఆదేశించారు. డాక్టర్ శైలజ లెప్రసి, టిబిలపై అధికారులతో రివ్యూ చేశారు. ఎస్‌ఓ ఓబులరెడ్డి అబార్షన్‌లు, పీసీపీ ఎన్‌డీటీ యాక్టు, సెక్స్‌రేషియో తదితర అంశాలపై అధికారులకు డిప్యూటీ డెమో దేవశిరోమణి వివరించారు. కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.